



విలేకర్ల సమావేశంలో ఫోటోలు చూపుతున్న నగర కమిషనర్

వెలుగు నింపని 'కంటి వెలుగు'

- తొలగని అంధకారం
- 25 శాతం మందికే కంటి అద్దాలు

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం 2019లో వైయస్సార్ కంటి వెలుగు పథకానికి శ్రీకారం చుట్టింది. అప్పట్లో వైద్యనిపుణులు ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలల్లో ఒకటి నుండీ పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. రెండు విడతల్లో పరీక్షలు చేయించుకున్న విద్యార్థుల్లో 25శాతం మందికి మాత్రమే కంటిఅద్దాలు పంపిణీ చేశారు. కంటి వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు అవసరమైన పిల్లలకు అనేకమంది నేటికీ కంటి అద్దాల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు.

35 శాతం మందికి పంపిణీ కానీ కంటి అద్దాలు

వైద్యనిపుణులు లెక్కల ప్రకారం ప్రతి పాఠశాల్లో 15 నుండీ 25 శాతం మంది విద్యార్థులు కంటిసమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లో అక్షరాలు కనిపించకపోవడం, క్లాస్‌రూమ్ బోర్డు సక్రమంగా కనిపిచండం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. సెల్‌ఫోన్సు ఎక్కువగా చూడటం, డిజిటల్ తరగతులు, కంప్యూటర్ ముందు కూర్చోవడం, టీవి ఎక్కువగా చూడటం వల్ల కూడా పిల్లల్లో కంటిసమస్యలు వస్తున్నట్లు గ్రహించారు. పాఠశాలల్లో కంటిపరీక్షలు నిర్వహిస్తూ అద్దాల పంపిణీ, శస్త్రచికిత్సలు అలస్యం చేస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఏటా వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం ద్వారా పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించేలా ప్రభుత్వం రూపొందించిన పథకం కరోనా కారణంగా ఆగిపోయింది. 2019 నుండీ తిరిగీ ఈ పథకం పట్టాలెక్కలేదు.

విద్యార్థుల్లో కంటి సమస్యల తీవ్రతను బట్టి పిల్లలకు కళ్ళజోళ్ళు కొంతమందికి చాలా అవసరం అని నిపుణులు సిఫారసు చేశారు. 2019లో రెండోసారి చేసిన పరీక్షల్లో 35శాతం మంది పిల్లలకు ఇంకా కంటి అద్దాలు పంపిణీ చేయాల్సి ఉందని ప్రధాన ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఏటా కంటి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పిన ప్రభుత్వం 2019 తర్వాత చాలాకాలం పాటు పరీక్షలు చేయించకపోవడం గమనార్హం.



వైయస్సార్ కంటి వెలుగు పథకం నేత్ర పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం 2019లో చేపట్టిన మొదటి విడత కార్యక్రమంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించింది. వీరిలో ఇరవై శాతం మంది మాత్రమే కంటి అద్దాలు అందించింది. రెండో విడతలో 14252 మందికి కంటి వైద్య పరీక్షలు చేయగా ఎవరికి కంటి జబ్బులు లేవని నిర్ధారించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తే కంటి జబ్బులతో బాధపడుతున్న చిన్నారుతు నిత్యం ఆసుపత్రులు చుట్టూ తిరుగుతున్నారు. వేల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ ఆస్పత్రి వద్ద చికిత్స చేయించుకోవడం వేచి ఉంటున్నారు.

చిన్నారుల్లో 18 ఏళ్ల వరకు ఎదుగుదల ఉంటుంది. శరీర అవయవాల్లో మార్పులు తగ్గట్టు కంటి చూపులోను మార్పులు ఉంటాయి. నిత్యం ఫోన్లు చూడటం ఆన్లైన్ చదువుల నేపథ్యంలో దష్టిలోపం సమస్య పెరుగుతోంది. గతంలో 100 మందికి గాను ఐదు మంది కంటి సమస్యలుంటే ప్రస్తుతం 15 మందికి పైగా కంటి చూపు సమస్యతో బాధపడుతున్నారు. ఈనేపథ్యంలో కంటి వైద్యపరీక్షలు ఇచ్చిన కంటి అద్దాలు మార్చాల్సిన అవసరం ఉంది. ఇటీవల యాదమరి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకటి నుండి పదవ తరగతి వరకు కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తే ఒక్కో తరగతిలో సుమారు 4 నుంచి 12 మంది పిల్లలు కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు.

కంటి పరీక్షలకు వేలల్లో ఖర్చు..

ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వివిధ కారణాలతో కంటి సమస్యలు ఎదుర్కొటున్నారు. చిన్న, చిన్న శస్త్ర చికిత్సల కోసం వేలకువేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక్కసారి కంటి ఆసుపత్రికి వెళ్ళి సాధారణ ఓపి కోసం రూ.500 నుంచి 1000లు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక శస్త్ర చికిత్సల కోసం పెద్ద మొత్తం ఖర్చు చేయాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తిరిగీ వైఎస్ఆర్ కంటి వెలుగు పథకాన్ని ప్రారంభించి విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే మొదటి, రెండో విడతల్లో వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, శస్త్ర చికిత్స కోసం ఎంపిక చేసిన విద్యార్థులు అద్దాలు, శస్త్ర చికిత్సలు నిర్వహించాలని కోరుతున్నారు.



వైఎస్సార్ విగ్రహం సురక్షితం

రోడ్డు పనుల కోసమే అక్కడి నుంచి తీశాం : కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వైఎస్ఆర్ విగ్రహం రాత్రిరాత్రే తొలగించడం.. చిత్తూరు నగరంలో వివాదాలకు తెరలేపింది. ఉన్నట్లుండి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తొలగించడం పట్ల నగర పాలక సంస్థ తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. జిల్లా కలెక్టరేట్ వద్ద ఉన్న వైఎస్ఆర్ నిలువెత్తు విగ్రహాన్ని రాత్రిరాత్రే తొలగించారన్న సమాచారం సోషియల్ మీడియాలో అలజడి సృష్టించడంతో బుధవారం చిత్తూరు నగర కమిషనర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇవ్వాల్సి వచ్చింది. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర కమిషనర్ అరుణ వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించేందుకు కారణాలు తెలియజేశారు. జాతీయ రహదారి -4 విస్తరణలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని తీసి, సురక్షిత ప్రాంతంలో ఉంచడం జరిగిందని చెప్పారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వై జంక్షన్ అభివద్ధి, ఆరు వరసల రహదారి, ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరగవలసిన నేపథ్యంలో విగ్రహాన్ని తగిన జాగ్రత్తలతో అక్కడి నుండి తీసి సురక్షితంగా నగరపాలక సంస్థ ఆధీనంలో ఉంచడం జరిగిందన్నారు. విగ్రహాన్ని సురక్షితంగా ఉంచిన ఫోటోలను కమిషనర్ చూపించారు. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత తగిన ప్రదేశంలో విగ్రహాన్ని ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు.

టిడ్కో కాలనీలకు మౌలిక వసతులు

ఈటీపీ ప్లాంట్స్‌కు సంబంధించి భూసేకరణ : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: టిడ్కో గహాలకు సంబంధించి మౌలిక వసతులు వేగంగా పూర్తిచేయాలని, చిత్తూరు, పలమనేరు, పుంగనూరు మున్సిపాలిటీల పరిధిలోని ఈటిపి ప్లాంట్ల ఏర్పాటుకు భూసేకరణ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ తెలపారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ టిడ్కో అధికారులు, చిత్తూరు కమిషనర్, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరులోని కట్టమంచి, దొడ్డిపల్లి, కైలాసపురం ప్రాంతాలలో ఈటీపి ప్లాంట్లను నిర్మించాల్సి ఉందని అధికారులు కోరిన విధంగా భూసేకరణ చేయాలని చిత్తూరు తహసీల్దార్ మురళీ మోహన్‌ని ఆదేశించారు. అదేవిధంగా పలమనేరులోని పెద్దచెరువు వద్ద ఏర్పాటు చేయాల్సిన ఈటిపి ప్లాంట్‌కు వెంటనే భూసేకరణ చేయాలని అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షన్మోహన్

పుంగనూరులో ఏర్పాటు చేసే ట్రీట్ మెంట్ ప్లాంట్‌కు స్థల సేకరణ పూర్తిచేసి మున్సిపల్ అధికారులకు అప్పగించాలని సూచించారు. మున్సిపల్ అధికారులు కోరిన విధంగా స్థలం సేకరించి వారికి ఇవ్వాలన్నారు. చిత్తూరు పుంగనూరులలో నిర్మిస్తున్న అర్బన్ హౌసింగ్ (టిడ్కో)లలో మౌలిక సదుపాయాల పనులు వేగంగా పూర్తి చేయాలని అక్టోబర్ 10వ తేదీ నాటికి పుంగనూరు అర్బన్ హౌసింగ్ కాలనీ అప్పగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పుంగనూరులో 1,536 గహాల సముదాయం చిత్తూరులో 2,850 గహాల సముదాయం పనులు వేగంగా నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో చిత్తూరు నగరపాలిక కమిషనర్ అరుణ, పలమనేరు, పుంగనూరు కమిషనర్లు కిరణ్‌కుమార్, నరసింహ ప్రసాద్, పలమనేరు, పుంగనూరు తహసీల్దార్ కుప్పుస్వామి, సీతారాం, అర్బన్ హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

అడవిపల్లి రిజర్వాయర్ సందర్శన


అడవిపల్లి రిజర్వాయర్ సందర్శిస్తున్న స్మార్ట్‌సిటి డెవలప్మెంట్ సొసైటీ ప్రతినిధులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరుకి శాశ్వత తాగునీరు అందించే, పీలేరు సమీపంలోని అడవిపల్లి రిజర్వాయర్‌ను బుధవారం చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖ డీఈఓ, ఏఈలు సందర్శించారు. ఈసందర్భంగా డీఈ పుష్పగిరి నాయక్ మాట్లాడుతూ అడవిపల్లి రిజర్వాయర్ నుంచి చిత్తూరు వరకు 93 కిలోమీటర్ల మేర పైప్లైన్ ద్వారా నీటిని తరలిస్తూ, మార్గమధ్యంలో దామలచెరువు దగ్గర వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా నీటిని శుద్ధి చేసి, చిత్తూరు నగరానికి అందిస్తామన్నారు. ఇది అమత పథకం కింద రూ.250కోట్లతో ఖర్చు చేస్తున్నామన్నారు. 2055వ సంవత్సరానికి పెరిగే జనాభా అవసరాలని దష్టిలో పెట్టుకుని ఈ పథకాన్ని రూపొందించామని అన్నారు. 2024 మార్చి నాటికి దాదాపుగా ప్రాజెక్టు పనులు పూర్తవుతుందని, ఒక రోజుకు 37లక్షల లీటర్ల నీటిని శుద్ధి చేసి చిత్తూరు నగర కార్పొరేషన్‌కు అందిస్తామని, తదనంతరం కార్పొరేషన్ వారు ట్యాంకులు, ఇదివరకే ఉన్న పైపులైన్ల ద్వారా ఇంటింటికి నీరు చేరుస్తారన్నారు. కార్యక్రమంలో తాండవ మూర్తి, శివకుమార్, సత్య, కేశవరెడ్డి, నాగేందర్ లు పాల్గొన్నారు.

డెయిరీ కార్మికుల బిక్షాటన


అమూల్ డెయిరీ ప్రధాన భవనం ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తమ పాత బకాయిలు చెల్లించాలని కోరుతూ స్థానిక రెడ్డిగుంట అమూల్ డెయిరీ ఎదుట విజయ డెయిరీ కార్మికులు చేపట్టి రిలే దీక్షలు బుధవారానికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఎనిమిది రోజులుగా దీక్షలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ కార్మికులు భిక్షాటలను పూనుకోవడంతో పాటు అమూల్ డెయిరీ ఉద్యోగులను లోనికి వెళ్ళకుండా అడ్డుకున్నారు. తమకు న్యాయం చేసేంత వరకు పనులను అడ్డుకుంటామని విజయ డెయిరీ కార్మికుల యూనియన్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అమూల్ ఉద్యోగులను అడ్డుకున్నారనే విషయం తెలియగానే సహకార సంస్థ జిల్లా కార్యదర్శి వనజ, చిత్తూరు తహశీల్దార్ మురళీ మోహన్, టూ టౌన్ సిఐ అమూల్ డెయిరీ వద్దకు చేరుకొని ఆందోళన చేస్తున్న కార్మికులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్‌తో చర్చలకు నాయకులను తీసుకుపోతామని హామీ ఇవ్వడంతో తమ బకాయి జీతాలు చెల్లించేంత వరకు రిలేదీక్షలు కొనసాగుతాయని కార్మిక సంఘం నాయకులు తెలిపారు.

ఆకట్టుకుంటున్న డ్వాక్రా స్టాల్స్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వినాయక నిమజ్జనం జరిగే కట్టమంచి చెరువు వద్ద ఏర్పాటు చేసిన డ్వాక్రా స్టాల్స్ ఆకట్టుకుంటోంది. వినాయక చవితి పర్వదినం సందర్భంగా కట్టమంచి చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి నగరపాలక సంస్థ ప్రత్యేక ఏర్పాట్ల చేపట్టింది. నగర కమిషనర్ డాక్టర జె.అరుణ ఈ సంవత్సరం ప్రత్యేకంగా డ్వాక్రా సంఘాలతో ఏర్పాటు చేయించిన స్టాల్స్ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఐదు రోజులపాటు నగర ప్రజలు నిమజ్జనం కోసం తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల కోసం ప్రత్యేకంగా డ్వాక్రా ఉత్పత్తులతో కూడిన స్టాల్స్‌ను ఏర్పాటు చేయించారు. బొమ్మల కొలువు, అల్లికలతో తయారుచేసిన బుట్టలు, అలంకరణ వస్తువులు, చిన్నపాటి గహోపకరణాలు, దుస్తులు తక్కువ ధరకే అందుబాటులో ఉంచారు. వీటితోపాటుగా చిరు, తణధాన్యాలతో తయారుచేసిన వంటకాలతో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. ఆహా పేరుతో ఏర్పాటు చేసిన క్యాంటీన్లో అల్పాహారాలను అందుబాటులో ఉంచారు. వినాయక చవితి పురస్కరించుకొని వినూత్న ఆలోచనతో కమిషనర్ ఏర్పాటు చేసిన డ్వాక్రా స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి నగర ప్రజలను ఆకట్టుకుంటున్నాయి.

ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో 18 సంవత్సరాల నిండిన యువతను ఓటరుగా నమోదు చేయించుటకు అధికారులతో పాటు రాజకీయపార్టీల నాయకులు సహకరించాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి ఎస్ఎస్ఆర్ 2024పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18 సంవత్సరాల నిండిన యువతను ఓటరుగా నమోదు చేయించుటకు అధికారులతో పాటుగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఒకే ఇంటిలో 10 ఓట్లు కంటే ఎక్కు మంది ఓటర్లు ఉన్న ఇళ్లను గుర్తించి ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయడం జరిగిందని తెలిపారు. ఈనెల 22న మళ్ళీ ఒక్కసారి రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి ఫైనల్ ఓటర్ జాబితాను రాష్ట్ర ఎన్నికల అధికారికి పంపించడం జరుగుతుందని తెలిపారు. వివాహమైన మహిళలు ఇతర రాష్ట్రాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓట్లు గుర్తించి ఓటరు జాబితా నుండి తొలిగించాలని బియల్ఓలకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికే సాధమైనంతవరకు పరిశీలించి తొలగించడం జరిగిందని ఇంకా ఏమైనా ఉంటే వాటిని పరిశీలించాలి తొలగించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించి 18 సంవత్సరాలు నిండి వారు ఇంకా ఓటర్‌గా నమోదు చేసుకోకుంటే అలాంటి వారికి ప్రత్యేక డ్రైవ్ ఏర్పటు చేయించి, ప్రతి ఒక్కరినీ ఓటర్‌గా నమోదు చేయించడం జరుగుతుందన్నారు. సమావేశం వైఎస్సార్ సిపి నుంచి ఉదయ్, టిడిపి సురేంద్ర కుమార్, సిపిఎం నుంచి వాడ గంగరాజు, సిపిఐ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నుంచి పరదేసి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతనిధుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించండి : జెసి



ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజాసమస్యలను బాధ్యతగా సంబంధిత అధికారులు పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జెసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారంనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ స్పందన కార్యక్రమాన్ని మరింత మెరుగు పరిచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుందనన్నారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు వారి సమస్యలను పరిష్కరించే దిశలో భాగంగా వెంటనే పరిష్కరించే అర్జీలను నిర్ణీత గడువు లోపల పరిష్కరించాలని, ఆర్థికపరమైన అంశాలతో కూడి ఉన్న అర్జీలను సంబంధిత శాఖలకు పరిష్కార నిమిత్తం పంపి, పరిష్కరించలేని సమస్యలను పరిష్కరించకపోవడానికి గల కారణాలను అర్జీదారునికి తెలియజేయాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం జిల్లా స్థాయిలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి వారంలో బుధ,శుక్రవారాలలో మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమ నిర్వహణ ద్వారా సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అర్జీదారుల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నాణ్యతతో నిర్ణీత గడువు లోపల పరిష్కరించాలన్నారు. నిష్పక్షపాతంగా ప్రభుత్వ నియమ నిబంధనలను పాటిస్తూ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డిఆర్‌డిఏ, డ్వామా పీడీలు తులసి, గంగా భవాని, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు మురళీ కష్ణ, మధుసూదన్ రెడ్డి,ప్రభాకర్, ఆర్ అండ్‌బి ఎస్ఈ ఉమామహేశ్వర రెడ్డి, పిఆర్ ఈఈ చంద్ర శేఖర్‌రెడ్డి, డిపిఓ లక్ష్మీ, డిఎల్‌డిఓ రవికుమార్, పలమనేరు ఆర్‌డిఓ శివయ్య, తహశీల్దార్ లోకేశ్వరావు, ఎంపీపీ రెడ్డప్ప, సింగిల్ విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, ఎంపిడిఓ అబ్దుల్ రహీం, స్థానిక సర్పంచ్ అఖిలా జాఫర్, కోఆప్షన్ నెంబర్ రహమతుల్లా, నాయకులు గురునాథరెడ్డి, రెవెన్యూ సిబ్బంది డిప్యూటీ తాసిల్దార్ ఫణి కుమార్, గ్రామరెవెన్యూ అధికారి సుబ్రహ్మణ్యం, ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఆరోవ చిరుత బంధీ

భక్తుల భద్రతే ముఖ్యం: టిటిడి

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల అలిపిరి కాలినడక మార్గంలో టీటీడీ ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన బోనులో మరో చిరుత చిక్కింది. కొద్ది రోజుల క్రితం కాలినడక మార్గంలో కొండపైకి వెళ్తున్న భక్తుల్లో ఓ చిన్నారి లక్షితపై పులి దాడి చేసింది. ఈఘటన జరిగిన ప్రదేశానికి అతి సమీపంలో అంటే 2850 మెట్టు దగ్గర టీటీడీ అటవీశాఖ అధికారులు పులి కోసం బోను ఏర్పాటు చేశారు. అందులో బుధవారం తెల్లవారు జామున ఓ చిరుత చిక్కింది. గత వారం రోజులుగా అదే ప్రాంతంలో చిరుత తిరుగుతున్నట్లుగా అధికారులు గుర్తించారు. బుధవారం వేకువ జామున బోనులో వేసిన ఎర్రకు చిరుత చిక్కినట్లుగా అటవీశాఖ అధికారులు గుర్తించారు. చిరుతను తిరుపతిలోని జూపార్క్‌కు తరలించారు. ఇప్పటి వరకూ మొత్తం 6 చిరుతలను అటవీ శాఖ అధికారులు బంధించి జూపార్క్ తరలించారు. ఇందులో రెండు చిరుతలను అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు.




తిరుమలలో చిరుత చిక్కింది..

టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చిరుత బోనుకు చిక్కిన ప్రాంతంను పరిశీలించారు. రెండు నెలల కాలంలో ఆరోవ చిరుత బోనులో చిక్కిందన్నారు. భక్తుల భద్రతపై టిటిడి ఎంత చిత్తశుద్ధితో ఉన్నది అనడానికి ఇదే ఉదాహరణ అని ఆయన చెప్పారు. గడిచిన రెండు నెలల కాలంలో ఇప్పుడు పట్టుబడిన చిరుతతో కలిపి మొత్తం ఆరు చిరుతలను పట్టుకున్నట్లుగా తెలిపారు. యాత్రికులు ఏ రకమైన ఇబ్బంది కలగకుండా అన్నీ చర్యలు టీటీడీ తీసుకుంటుందని చెప్పారు. కొండపైకి నడిచి వచ్చే భక్తులతో పాటు భద్రతా సిబ్బందిని కూడా నియమించామన్నారు. గుంపులు గుంపులుగా వెళ్ళమని అభ్యర్థించి వాళ్ళల్లో ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని నింపటం కోసం కర్రలు ఇచ్చినట్లుగా తెలిపారు. ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోకుండా మళ్ళీ చిరుతల్ని పట్టటానికి టిటిడి అటవీ సిబ్బంది రేయింబవళ్లు పనిచేస్తుందన్నారు. బుధవారం తెల్లవారు జామున చిక్కిన ఆరవ చిరుతను నాలుగు సంవత్సరాల వయసు ఉన్నదిగా గుర్తించామన్నారు.

ట్రాప్ కెమెరాలతో నిఘా..

టీటీడీ శాస్త్రీయంగా అటవీశాఖ అధికారులు ఇచ్చిన నివేదిక మూలంగానే నడక మార్గంలో కంచె కావచ్చు ఏర్పాటు చేస్తామందని, యాత్రికుల రక్షణ, భద్రత టిటిడిదేననిభూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేశారు, నిరంతరంగా చిరుతలను పట్టుకునే కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. ఇంకా తిరుగుతున్న చిరుతల్ని పట్టుకునేందుకు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 300పైగా ట్రాప్ కెమెరాలతో నిఘా పర్యవేక్షణ చేస్తున్నట్లుగా టీటీడీ చైర్మన్ తెలిపారు.

ముత్యపు పందిరిపై శ్రీమలయప్ప


ముత్యపు పందిరిపై ఊరేగుతున్న శ్రీవారు

ప్రజాశక్తి- తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన బుధవారం ఉదయం శ్రీ మలయప్పస్వామి సింహ వాహనంపై యోగ నరసింహుడి అలంకారంలో దర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బందాలు భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది.



సింహ వాహనం - ధైర్యసిద్ధి

శ్రీవారు మూడో రోజు ఉదయం దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం సింహ వాహనాన్ని అధిరోహించారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహాధ్వనికి సంకేతం. ఉదయం నిద్ర లేవగానే దర్శించే వస్తువుల్లో 'సింహదర్శనం' అతి ముఖ్యమయింది. సింహ రూప దర్శనంతో పైన పేర్కొన్న శక్తులన్నీ చైతన్యవంతమవుతాయి. సోమరితనం నశించి పట్టుదలతో ప్రవర్తించి విజయస్ఫూర్తి సిద్ధిస్తుంది. అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో నేను, నా వాహనమైన సింహమూ సమాన ప్రయత్నంతో ఉంటామని ఈ సింహ వాహనోత్సవం ద్వారా శ్రీవారు నిరూపించారు.

చిన్నపిల్లలకు జియో ట్యాగ్

బ్రహ్మోత్సవాలకు విచ్చేసే చిన్నపిల్లలు తప్పిపోకుండా టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి, జెఈఓ సదా భార్గవి, తిరుమల అదనపు ఎస్పీ మునిరామయ్యతో కలిసి జియో ట్యాగింగ్ కట్టడం ప్రారంభించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ముత్యపుపందిరి వాహనంపై స్వామివారు అభయమిస్తారు. వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జెఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ఏపీ ఎన్జీఓ సంఘం తాలూకా అధ్యక్షులు ఆనందబాబు

ప్రజాశక్తి- పలమనేరు

రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించిన గ్యారంటీ పెన్షన్ విధానం రాష్ట్రంలో లక్షలాది మంది ఉద్యోగ ఉపాధ్యాయులు అంగీకరించలేదని, ముఖ్యమంత్రి పాతపెన్షన్ పునరుద్ధరణకు పునరాలోచించాలని పలమనేరు తాలూకా ఏపీఎన్జీఓ సంఘం అధ్యక్షుడు ఆనందబాబు అన్నారు. బుధవారం స్థానిక ఎన్జీఓ హోంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి అధికారంలోకి రాక ముందు ఇచ్చిన సిపిఎస్ రద్దు హామీని నెరవేర్చాలని ఆయన కోరారు. దేశంలో అనేక రాష్ట్రాలు పాతపెన్షన్ విధానం వైపు పయనిస్తూ ఉంటే మన రాష్ట్రంలో మాత్రం సిపిఎస్ పేరు మార్చుకొని అమలులోకి వస్తున్న అంశం పట్ల, క్షేత్ర స్థాయిలో ఉద్యోగుల్లో అసంతృప్తి ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజల కొరకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి ఉద్యోగ ఉపాధ్యాయుల పెన్షన్ విషయంలో కూడా మరొకమారు పునరాలోచన చేయాలని ఆయన కోరారు.

ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యం



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి ముందస్తుగా సమస్యల పరిష్కారం చేస్తూ ప్రజల ఆరోగ్య సంరక్షణ లక్ష్యమని మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నెలవాయిలో 178, ముదికుప్పం లో 252 ఇళ్ళలో సర్వే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని ముందస్తుగా 130 టెస్టులు చేశారు. ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాల పట్ల హర్షం

ప్రజాశక్తి- పలమనేరు : ఎపి రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు పట్ల వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ బుధవారం సాయంత్రం హర్షం వ్యక్తం చేసింది. వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా గౌరవ సలహాదారు ఎన్. సోమచంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్.సోమచంద్రారెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ అయిన ఉద్యోగుల పిల్లలకు కాలేజీలలో ఫీజు రియింబర్స్‌మెంట్ చేస్తామని, ఆరోగ్యశ్రీ (ఇహెచ్ఎస్) వర్తింపజేసే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. అదేవిధంగా కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ సర్వీసును క్రమబద్ధీకరిస్తూ ఆమోదించడం అభినందనీయమన్నారు. అయితే ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన జీపీఎస్ పథకం అమలుకు పారదర్శకంగా తెలియజేసి ఉద్యోగుల సలహాలు మేరకు మార్పులు చేయాలని కోరారు. చాలా కాలంగా పెండింగ్‌లో వున్న సమస్యలను పరిష్కరిస్తూ కాబినెట్ నిర్ణయం చేయడం శుభ పరిణామం అన్నారు. వైఎస్ఆర్ టిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం. పుష్పావతి, కోశాధికారి ఎఆర్. కుమార్, పి.పట్టాభి రామయ్య, పిఎఫ్.రోషన్ ఆలీఖాన్, పి.రమేష్, సదాశివ వడయార్, ఉపాధ్యక్షులు విఎస్.రమేష్ బాబు, తదితరులు వున్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి - కార్వేటినగరం: మండల పరిధిలోని కొల్లాగుంట, ఆర్కేవీవీపేట, కార్వేటినగరం పెద్ద దళితవాడ, పద్మసరస్సు ఎస్టీకాలనీలలో బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.22.50లక్షల చెక్కులను ఎంపీపీ లతబాలాజీ బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పలు ప్రమాదాల్లో మతిచెందిన కుటుంబాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చొరవతో అనతి కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేసి వారి కుటుంబాలను అండగా నిలుస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా పలువురికి సిఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మంత్రి వ్యక్తిగత కార్యదర్శి ఆనందరెడ్డి, సర్పంచ్లు ధనంజయవర్మ, డీ.దివ్య, ఎస్.దివ్య, శేషాద్రి, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్ మునికష్ణ, సుబ్రమణ్యంరెడ్డి, చందురాజు, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మురగయ్య, కార్యదర్శులు లోకేష్ వాసులు పాల్గొన్నారు.

గోవింద భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి- నగరి : స్థానిక ఓంశక్తి ఆలయం వద్ద తమిళనాడు ఓచ్చేరి నుంచి విచ్చేసిన సుమారు వెయ్యి మంది గోవింద భక్తులకు పట్టణ పరిధిలోని పలువురు దాతలు అన్నదానం చేశారు. దీంతో ఓంశక్తి ఆలయ ఆవరణలతో పాటు రహదారి కూడా గోవింద భక్తులతో నిండింది. భజన అనంతరం ఆలయంలోని గోవింద భక్తులతో పాటు, పాదచారులకు కూడా అన్నదానం చేశారు. దాతలు ఆరుముగం, పెరుమాళ్, రమేష్, గోపాల్‌రెడ్డి, దయానిధి, మునికష్ణారెడ్డి, ఎల్లప్పరెడ్డి, కుమార్, వేలు, రామ్‌మోహన్, కపానిది, అశోక్, రామూర్తి, బాలాజి, ఆనంద్, యుగంధర్, జగన్, హరిపోతన్, పొన్నురంగం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

పూతలపట్టు నియోజకవర్గ కన్వీనర్ ఉమాపతి మాదిగ

ప్రజాశక్తి- బంగారుపాల్యం: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని పూతలపట్టు నియోజకవర్గం మాదిగ కన్వీనర్ ఉమాపతి మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుండి జరుగుతున్న పార్లమెంటు సమావేశంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని, మాదిగలకు అధికశాతం రిజర్వేషన్ కల్పించాలని, ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు మాదిగలకు అన్యాయం జరుగుతున్నదని తెలిపారు. ఎస్సీ వర్గీకరణలోనే మాదిగలు అభివద్ధి చెందుతారని తెలిపారు. హరిబాబు మాదిగ, దినకర్ మాదిగ, అజయ్ మాదిగ, మంజునాథ్ మాదిగ, నాగభూషణం మాదిగ, వనమ్మ మాదిగ, రాజా మాదిగ, ప్రసాద్ మాదిగ, పార్వతి మాదిగ పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక... ఆనందం..

రోడ్డుపై ఎటు చూసినా పసుపు మయం
భక్తితో స్వామి చెంతకు తమిళనాడు వాసులు



ప్రజాశక్తి- వెదురుకుప్పం: భక్తిశ్రద్ధలతో ఏడుకొండల స్వామిపై భారం మోపి కోరిన కోర్కెలు తీర్చాలని, మరికొంతమంది కోరుకున్న కోర్కెలు తీరాయని తమిళనాడు రాష్ట్రం నుంచి కాలినడకన తిరుమలకు వెళుత్తుంటారు. పసుపు వస్త్రాలను ధరించి గోవింద నామస్మరణతో కాలినడకన ఎండనక, వాననక నడుచుకుంటూ తిరుమలకు చేరుకుని మొక్కులు చెల్లించుకుంటారు. బుధవారం వెదురుకుప్ప మండలం పచ్చికాపల్లంకు చేరుకున్న వారిని ప్రజాశక్తి పలకరించింది.

తమిళనాడు రాష్ట్రం, రాగిపేట మావటం జిల్లా, అర్కాడు గ్రామానికి చెందిన భక్తులు ఈనెల 18వ తేదీన ఆ గ్రామం నుంచి సుమారుగా 3,000 వేలమంది భక్తులు తిరుమలకు బయలుదేరారు. కళ్యాణమైన రోజు వారు ఏకువ జామునని నిద్రలేచి ఇల్లు వాకిలి శుభ్రం చేసుకుని, పవిత్ర స్థానాలు ఆచరించి, వంటి నిండా పసుపు పూసుకుని, పసుపు వస్త్రాలను కట్టుకొని వారి స్వగ్రామంలో దేవాలయం దగ్గర గోవిందనామ స్మరణతో కాలిమార్గంలో బయలుదేరారు.

తిరుమలలో గరుడ సేవ రోజున అక్కడికి చేరుకుని స్వామివారిని దర్శించుకోవడం ఆగ్రామం ప్రజలకు ఆనవాయితీ. భక్తులకు కావలసిన అన్న ప్రసాదాలు, టిఫిన్, టీ అదే గ్రామానికి చెందిన ఆర్కేటైల్ బాలాజీ అనే వ్యక్తి వితరణగా అందజేస్తున్నారు. ఓ వాహనంలో వంటలకు కావలసిన సామాగ్రి, వస్తువులను ఆయన ఏర్పాటు చేశారు. ప్రతి 15 కిలోమీటర్లకి ఒక దగ్గర వారికి ఉదయం టిఫిన్, సాయంకాలం టి, రాత్రికి భోజనం కల్పిస్తారు. అన్నీ ఖర్చులను బాలాజీ అనే దాతే భరిస్తారని వారు చెబుతున్నారు. మండలం పచ్చికాపల్లంలోకి వారు ప్రవేశించే గోవింద నామస్మరణ చేసుకుంటూ తిరుమలకు నడుచుకుంటూ వెళ్లారు.



కోరిన కోర్కె నెరవేరింది...
- కేసవి ఆర్కాడు గ్రామం

మా కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు మా కష్టం తీర్చితే ఏడుకొండల స్వామి దగ్గరకి కాలినడకన వస్తానని మొక్కుకున్నాను. ప్రస్తుతం కష్టలు తీరి మాకుటుంబం బాగుంది. మా పిల్లోల్లు బాగా చదువుకుంటున్నారు. దీంతో మొక్కు తీర్చుకోవడానికి తిరుమలకు వెళుత్తున్నాను

ప్రతి సంవత్సరం వెళతాం..
- ఈశ్వరి, ఆర్కాడు గ్రామం.



ప్రతి సంవత్సరం మా ఊరు నుంచి ఏడుకొండల స్వామి దగ్గరికి నడుచుకుంటూ వెళ్లడం ఆనవాయితీగా ఉంది. వెంకటేశ్వర స్వామిని నమ్ముకున్న తరువాత మా కుటుంబం ఆర్థిక ఇబ్బందులు తీరి బాగుంది. కనుకనే మొక్కులు చెల్లించుకునేందుకు ఏడుకొండల స్వామి దగ్గరికి బయలుదేరాం గరుడ సేవ రోజున స్వామిని చూస్తాం.

గోవింద నామస్మరణలో ఆనందం ఉంది.
- మావీరన్, ఆర్కాడు గ్రామం



ఏడుకొండల స్వామిని గోవిందా గోవిందా అంటే ఇష్టం అంట. అలా ఆయన్ను స్మరించుకుంటూ మా గ్రామం నుంచి నడుచుకుంటూ వెళుతూ ఉంటే ఆ బాధలోనూ ఆనందం ఉంది. ఇది మాటల్లో చెప్పలేనిది. ప్రతి సంవత్సరం ఇదేవిధంగా మా గ్రామం నుంచి వేల సంఖ్యలో బయలుదేరి గరుడసేవ రోజు స్వామివారిని దర్శించుకుంటాం.

ఇంటింటా సర్వే బాధ్యతగా నిర్వహించాలి

డిఎంఅండ్ హెచ్‌ఒ ప్రభావతిదేవి



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలోని ప్రోగ్రాం అధికారులు స్టేట్ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ జూమ్ కాన్ఫరెన్సుకు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన 'జగనన్న రక్ష' కార్యక్రమానికి ప్రతి ఒక్కరు బాధ్యతతో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని మానిటర్ చేస్తూ ఈనెల 30 నుంచి జరగబోయే స్పెషల్ మెడికల్ క్యాంప్స్‌లో ప్రజలందరూ తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎక్కడ కూడా ప్రత్యేక పరీక్షల నిమిత్తమై గాని, మందుల పంపిణీ విషయంలో కానీ ఎలాంటి లోటుపోట్లు లేకుండా ప్రోగ్రాం అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రవిరాజు, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ సందీప్, వాణిశ్రీ, రేణుక ప్రభ తదితర అధికారులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

గ్రామీణాభివద్ధి పీడీ తులసి



మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేసి పీడీ తులసి

ప్రజాశక్తి- చిత్తూరు: ఆర్థిక అక్షరాస్యతపై శిక్షణ తీసుకున్న ప్రతిమహిళ వ్యాపారవేత్తలుగా ఎదగాలని డిఆర్డిఏ పథక సంచాలకులు డిఎంజె తులసి కోరారు. బుధవారం చిత్తూరు ఎస్ఎల్ఐసి కార్యాలయంలో అక్షరాస్యతపై సుమారు 35 మందికి శిక్షణ ముగింపు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి తులసి ఐఎన్‌డిఏస్ ఈటిఐ ఇండిసెంట్ డైరెక్టర్ ప్రేమసాగర్ పాల్గొన్నారు. పిడి తులసి మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై ఇచ్చిన శిక్షణను మహిళలు గ్రామస్థాయిలో ఉన్నటువంటి మహిళ సభ్యులకు క్షుణ్ణంగా తెలియజేయాలని కోరారుజ అదేవిధంగా సంఘాలకు ఉపయోగపడే ఆర్థిక ప్రణాళిక సంఘం పంచ సూత్రాలు పాటించడం, నగదు రహిత లావాదేవీలు జరపడం, లోన్ యాప్‌ల ద్వారా మోసపోకుండా ఉండడం జీవనోపాధి కావలసిన రుణాలు పొంది గ్రామీణ స్థాయిలో మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో డిపిఎపి నాగేశ్వరరావు, సీనియర్ ఫ్యాకల్టీ అనిల్ కుమార్, ఇండిసం డైరెక్టర్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

వేడుకగా గణేష్ నిమజ్జన వేడుకలు



ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన రామసముద్రం గ్రామంలో బుధవారం పలు వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి రామసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం, బాల వినాయక సంఘం ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను ఆర్యవైశ్యులు, యువకులు ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం ఐదు కేజీల స్వామి వారి ప్రసాదమైన లడ్డును వేలంపాట నిర్వహించగా జి.మధుసూదన్ రూ.8500లకు వేలంపాటలో దక్కించుకున్నారు.

నగరి: వినాయక చవితిని పురస్కరించి పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన భారీ వినాయక ప్రతిమలు బుధవారం నిమజ్జనానికి ఊరేగింపుగా తరలింది. ఈసందర్భంగా వినాయక ప్రతిమను ట్రాక్టర్లలో ఎక్కించి ఎల్‌వీఆర్ ఫ్యాక్టరీ పక్కనే ఉన్న నీటి గుంటలోను, రామాపురం క్వారీ పక్కనే ఉన్న నీటిగుంటలోను వినాకయ ప్రతిమలను నిమజ్జనం చేశారు.కౌన్సిలర్ ఇంద్రయ్య, రాజేష్, సాయి, బాల, శేఖర్ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురం: పుల్లూరు క్రాస్ రోడ్‌లో సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి విగ్రహాన్ని క్షీరసముద్రం పరిధిలో ఉన్న కోనేరులో నిమజ్జనం చేశారు.



క్రైం న్యూస్

ద్విచక్రవాహనం, ఆటో ఢీ

ఒకరు మృతి



ఆరిమాకులపల్లి వద్ద నడిరోడ్డుపై బోల్తా పడిన ఆటో

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: ఆరుమాకులపల్లి బస్‌స్టాప్ సమీపంలో ప్యాసింజర్ ఆటో ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా మరొక పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఇంచార్జ్ ఎస్ఐ ఉమామహేశ్వర రెడ్డి తెలిపారు. మండలం ఆరుమాకులపల్లి బస్టాప్ వద్ద 10 మంది ప్యాసింజర్లతో ప్రయాణిస్తున్న ఆటోని ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఈప్రమాదం జరిగింది. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటోలో ప్రయాణించిన ఆనందయ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా, ద్విచక్రవాహనదారుడు కార్తిక్ పరిస్థితి సీరియస్‌గా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- నగరి : సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా జిల్లా, రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్.మధుసూదనం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ లోపు చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కాలేజి, డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు ప్రత్యేక వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రాంతీయ స్థాయి పోటీల ఫలితాలు అక్టోబర్ 15వ తేదీన, జిల్లా స్థాయి ఫలితాలు అక్టోబర్ 25వ తేదీన, రాష్ట్ర స్థాయి ఫలితాలు నవంబరు 5వ తేదీన ప్రకటిస్తామన్నారు. వీటికి సంబంధిత కరపత్రాలను డీఈవో విడుదల చేశారు.

రూ.25వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- నగరి : ఇటీవల నగరి మున్సిపాలిటీ ధర్మాపురం వద్ద జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో భూపాల్ కుటుంబం అసువులు బాసిన సంగతి విధితమే. భూపాల్ తల్లి, సోదరులను మంత్రి ఆర్కే రోజా సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి బుధవారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్ బీమా మంజూరు చేయించి ఇస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, సర్పంచ్ పర్యంథామన్, ఎంపీటీసీ యేసు, భాస్కర్‌రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'కేసులకు బెదరం.. బాబుతోనే పయనం'

కొనసాగుతున్న టిడిపి నిరసనలు




వికోటలో..


ప్రజాశక్తి- వీకోట: పాలక ప్రభుత్వం తన పైశాచిక ఆనందం కోసం తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టిన బెదిరేది లేదని, చంద్రబాబుతోనే తమ ప్రయాణమని తెలిపారు. మండల కేంద్రమైన వికోటలో బుధవారం మేము సైతం బాబుతోనే కార్యక్రమంలో భాగంగా టిడిపి బీసీసెల్, రైతు విభాగం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షులు నాగభూషణం, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు జగదీష్ నాయుడు ప్రభుత్వ వ్యతిరేక విధానాలను, బాబు అక్రమఅరెస్టును ఖండిస్తూ సమావేశంలో ప్రసంగించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర నాయుడు, శివకుమారి, సోమశేఖర్ గౌడ్, వెంకటేష్ నాయుడు, హరిబాబు, రహీం, ఆనంద్, మురళి,గణేష్ పాల్గొన్నారు.

గంగవరం: చంద్రబాబు నాయుడుకి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని మండల టిడిపి అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్ తెలిపారు. అధికార పార్టీ ఉద్దేశపూర్వకంగా చంద్రబాబు నాయుడును అరెస్టు చేసిందని వెంటనే బెయిల్‌పై విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సుబ్రహ్మణ్యంరెడ్డి, మోహన్, గిరిజ, ప్రసాద్, రహీం, మురళి పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా బుధవారం ఎనిమిదవ రోజు రిలే నిరాహార దీక్ష కొనసాగింది. టిడిపి ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు ప్రత్యేక గౌరవం లభించిందని రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి పాచిగుంట మనోహర్ నాయుడు, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి జనార్ధన్ రాజు, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు నాగేశ్వరరాజు, నియోజవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు ఈశ్వర్ ప్రసాద్ నాయుడు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు రవియాదవ్‌లు అన్నారు.



గంగవరంలో..



కుప్పంలో ప్రైవేట్ డాక్టర్లు

కుప్పం: చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా ప్రైవేటు డాక్టర్ల సురేష్ ఆధ్వర్యంలో ప్రైవేటు వైద్యులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని లేకుంటే ఇలాగే శాంతియుతంగా కుప్పంలో నిరసనలు వ్యక్తం చేస్తామని తెలిపారు. డాక్టర్లు ప్రశాంత్, తేజస్విని, ప్రియా, హేమంత్, మోనిషా, తిలక్, దేవేంద్ర పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండల క్లస్టర్ ఇంచార్జ్ మురళి ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బుధవారంతో నిరసన దీక్షలు ఎనిమిదో రోజుకు చేరాయి. జయశంకర్ నాయుడు, లోకనాథరెడ్డి, రుద్రప్ప నాయుడు, స్వామిదాసు, చంగల్రాయ్ యాదవ్, గుండయ్య, రెడ్డప్ప, వెంకటేష్, బిఎం రవి రాజారెడ్డి, కుప్పయ్య, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి సైన్స్ సెమినార్ పోటీలు



ప్రజాశక్తి- నగరి: స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి పీఎన్ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తణదాన్యాల ఆవశ్యకత గురించి చక్కగా వివరించారు. ఈ పోటీల్లో ధరణి (9వ తరగతి, బాలికల ఉన్నత పాఠశాల), బందా (9వ తరగతి ఏకాంబరకుప్పం జడ్పీహెచ్ఎస్), షిమ్‌రాన్‌ఫిరోజ్ (9వ తరగతి పుదుపేట జడ్పీహెచ్ఎస్), జ్యోతికష్ణ (10వ తరగతి పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల)విజేతలుగా నిలిచారు. వీరికి ఎంఈవో బహుమతులు ప్రధానం చేశారు.

పంట పొలాల పరిశీలన



ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని మేలుమై పంచాయతీలో బుధవారం జిల్లా రిసోర్స్ నాగపద్మిని పంట పొలాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటకు తెల్లమచ్చ రోగం ఉందని దీని నివారణకు కార్‌టాప్ హైడ్రోసైడ్‌తో పాటు నీటిని కలిపి పిచ్చికారి చేస్తే నివారించవచ్చని తెలిపారు. అలాగే కూరగాయల పంటల సమేతం పరిశీలించారు. పంటలకు రోగం సోకిన వెంటనే స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదిస్తే వాటికి కావాల్సిన పిచికారి మందులను వివరిస్తారని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం పలు వ్యవసాయ పంటలపై రైతులకు అవగాహన కలిగించారు. మండల వ్యవసాయ అధికారిని పద్మజ, ఆర్‌బికే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నూతన ఎన్‌సిసి యూనిట్ ప్రారంభం



ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 29 ఆంధ్ర బెటాలియన్ నూతన ఎన్‌సిసి యూనిట్‌ను బుధవారం ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా 29 ఆంధ్ర బెటాలియన్ సుబేదార్ ఆర్‌కే.పాండే, హవల్దార్ శివరాజ్, ఎంపీపీ లతబాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ చేతుల మీదుగా ఎన్‌సిసి యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. యూనిట్‌లో సుమారు 104 మంది విద్యార్థులను చేరడానికి అవకాశం కల్పించారు. వారు మాట్లాడుతూ ఎన్‌సిసి యూనిట్‌లో చేరడం అంటే దేశ సేవకు సిద్ధం కావడమేనని, ప్రజాసేవ చేయడానికి యువత ముందండాలని వారు తెలిపారు. అనంతరం 29 ఆంధ్ర బెటాలియన్ నుండి వచ్చిన సుబేధార్, హవల్దార్‌లు కళాశాల విద్యార్థుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి యూనిట్ కేర్ టేకింగ్ ఆఫీసర్ (సీటీవో) జే.బాబు, వైస్ ప్రిన్సిపాల్ బాలసుబ్రమణ్యం ఆచారి, అధ్యాపకులు ధనంజయ రెడ్డి, సిఎన్.లత, సుబ్బారావు, హరిబాబు, జోగిప్రసాద్, భార్గవి, లావణ్య, జేకేసీ మెంటర్ లోకేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సామగ్రి పంపిణీ



ప్రజాశక్తి- యాదమరి: క్షేత్రస్థాయి సిబ్బందికి బుధవారం బీపీ ఆపరేట్స్ పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ సురేఖ, సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినందున జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి సిబ్బందికి పల్స్ ఎక్సీమీటర్, టెంపరేచర్ గన్, బిపి ఆపరేటర్లను అందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పగడ్బందీగా నిర్వహించాలని, అలాగే ప్రతి ఇంటికి ప్రభుత్వం ఇచ్చిన టోకెన్లను జారీ చేసి వారికి కేటాయించిన తేదీల్లో వైద్యులు వద్ద వచ్చి పరీక్షలు చేసుకునే నిమిత్తం ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. హెల్త్ సూపర్వైజర్ అనసూయమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.